# ఆంధ్రావళి

శ్రీ రాయప్రోలు సుబ్బారావు

షష్టిపూర్తి ముద్రణము


. లలితా కుటీరము .

మారేడుపల్లి . సికందరాబాద

# मातृ गीता

नमो मंगळश्री महामातृभूमे
नमो भारताख्या सवित्रीललामे

नम स्ते हिमाद्यार्य धम्मिल्लतारा
नम स्ते त्रिवेणीभरक्षीरधारा

अलं दीप्यते तावकीना पताका
त्रिवर्णायिताकूत चक्रप्रतीका

ज्वलन्ती तवक्षात्र शस्त्रास्त्रमाला
वृणीते स्वयं शांति मक्रूरशीला

ध्रुवं ते प्रजा रामराज्यं स्वतंत्रम्
परं ते ह्यहिंसा मुखस्त्वीय मंत्रम्

प्रशाम्यंतु चान्नाम्बरक्षामखेदाः
विनश्यंतु राष्ट्रप्रजामित्रभेदाः

अशोकं भवे दार्तिजुष्टं प्रपंचम्
चिरं वर्धतां भारतीयं चरित्रम् !

*

గురువులు, శబ్ద బ్రహ్మ
స్వరూప లలితాశ్రయులు, రసవదిష్టార్థ
స్ఫుర దమృత కంథులు, కవీ
శ్వరులు, తదుద్బుద్ధ చరణ చరితము నెంతున్.

తాతల్ తండ్రులు ధర్మకర్మ
పరతంత్ర స్వప్రవృత్తిన్ నిజ
ఖ్యాతిన్ గాంచిరి; కాని మామక
తపఃకల్యాణి ఈయాంధ్ర
భాషాతోద్యశ్రుతిలో లయించినది,
అస్మన్నవ్య వాచా సరః
ప్రాతః పద్మ మరంద భాండ మిదె
అంబా! స్వీకరింపంగదే!

*

౧

# ఉ గా ది వం ద న ము

## శ్రీ ము ఖ

ఋతువున కొక్కరూపు నవరించి, అహర్నిశ లన్ తెరల్ యథో
చితముగ లేచి వ్రాలగ, కుశీలవులై నటియింప ప్రాణిసం
హతి సుఖదుఃఖరంగముల, నాదియు నంతము లేక సాగు నీ
స్తుతిమ దదృష్టకాల నయచోదన కంజలి నిత్తు నర్మిలిన్.

చిన్ని తెలిచుక్క లద్దిన వన్నెపాగ
లెగయ సిగలన్, సుగంధ సమృద్ధి నఖిల
దిశలు తలదిమ్ము వోవ, నేతెంచె నింబ
వృంత సుమ తోరణములతో శ్రీముఖంబు.

నవకము పుక్కిలించెను వనస్పతు లెల్లెడ, పుల్కరించె ప
ల్లవకులరాగరంజన మెలర్పగ కొమ్మలు, కన్నెతీగె లు
త్సవరతి నవ్వినట్లు వనధామములన్ కుసుమించె కుల్కుచున్;
కవిసె కిలార్చుచున్ వయసుకావరమే ప్రకృతిన్ సమస్తమున్.

ప్రసవించిన మెలతీవెల
పసిపాపల పొత్తు లాఱ బఱచిన పగిదిన్,
మిసమిసల చిగురుటాకులు
పసుపారెడు ఎఱుపు మెఱయ వటవృక్షములన్.

పది నెల లాయె బందెబడి వాకిలి మూసి రసాలవాటికన్
మెదలక యున్న కోయిల సమీరుని చక్కిలిగింతగుంఫనల్
కదపగ, మేలుకాంచి కలకంఠముతో నవనీతగోస్తనీ
మృదుమధురంబుగా కలవరించు మఘూదయపర్యుషస్సులన్.

*

# ధాత

నింబ కుసుమింప, మావి పిందియల మురియ,
చెఱుకు పాలీయ, శ్రుతు లభ్యసింప పికము,
పూలు పసుపాడ, కుంకుమన్ బూయ కొమ్మ,
వచ్చు నీ ధాత శుభములు తెచ్చుగాత!

మామిడి చూలు మోయ, నవమల్లిక పుష్పిణిగా, పయోధర
శ్యామలగాగ ధాత్రి, లలితార్చనలన్ నవరాత్రు లొప్ప, ము
క్తా మిహికావళిన్ సరసి తాల్ప, జరాచ్ఛదముల్ త్యజింప నా
రామ వనస్పతుల్, ఋతుపరంపర చక్రము దిగ్భ్రమించెడిన్.

కొమ్మల సిగపూలు కుప్పింత లిడ వన
ప్రియగీతికల కభినయము సూపి,
స్తబ్ధమాంసల మైన చైతన్య ముడికి లా
ఘవ మంద తపనయోగంబు సలిపి,
మెఱుగుచెంగులు త్రుళ్ల మింట కారాడు కా
దంబినికి మృదంగతంతు నేర్పి,
ముక్తదుర్దిన లైన పుణ్యాపద్మినులకు
పరమహంసల స్నేహభావ మొసగి,

పంటవలతికి తెలితలంబ్రాలు వోసి,
వృద్ధతరుల కాకులపాటుసిద్ధి నిచ్చి,
పాటవమున నీ షష్ఠాంక నాటకంబు
నాడి భరతవాక్యము పాడవయ్య ధాత!

*

## బహుధాన్య

శిఖల పువుల్ ధరించి విహసించెడు కొమ్మలు, ముమ్మరించె ది
జ్ముఖముల కోకిలాధ్యయనఘోష, మధువ్యసనోపలాలనం
బఖిలచరాచర ప్రకృతి నాముకొనెన్, బహుధాన్య సూచనా
సుఖ యగు నీ యుగాది దిన శోభనలక్ష్మికి దోయిలింపుమీ!

ఓఢ్రులం గలసిపో నెల్లక యల్లాడు
బ్రహ్మపురోపాంత బంధుజనము,
ద్రవిడదేశాంతరత్రస్తమై మాతృభా
షా క్షామమున క్రుంగు స్వకులజనము,
కర్ణాటకద్వేషకబళితకంఠమై
అగచాట్ల నడగారు ఆప్తజనము,
బలవదపిశ్వాసబద్ధమై పెడబోవు
రాయలసీమానురక్తజనము,
అతిచిరంతనావిచ్ఛిన్నమయిన ఆంధ్ర
జాతి భూతచరిత్రను సంస్మరించి,
తద్భవిష్యదభ్యుదయసంధాన మెంచి,
కలుపవమ్మ! ఏకముగా, ఉగాదితల్లి!

క్షాళింపుడీ! యువ స్వప్నాలతోడ న
న్యోన్యాంతరంగమాలిన్యములను,
ధరియింపుడీ! వినూతనవస్త్రములతోడ
దేశ సంవర్ధనాధీన దీక్ష,
మ్రింగుడీ! కట్వామ్లమిశ్రశాకముతోడ
రిక్తవాదజ్వరారిష్టతపన,
ఆలింపుడీ! గ్రహాకాలచారముతోడ
మానవోద్యోగతంత్రానువృత్తి,
గతము విస్మరించి, పురోఽభిహితము నెంచి,
పచ్చబడిన వాకిండ్లతో, పర్వశుభము
లయిన ఆశాముఖాలతో, నామతింపు
డీ! యుగాదిపండుగతల్లి నెల్లజనులు!

*

## ౨

# ప్రబోధము

అమరావతీపట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాడు,
ఓరుగల్లున రాజవీరలాంఛనముగా
పలుశస్త్రశాలలు నిలుపునాడు,
విద్యానగర రాజవీథులన్ కవితకు
పెండ్లిపందిళ్లు కప్పించునాడు,
పోట్నూరికి సమీపమున ఆంధ్రసామ్రాజ్య
దిగ్జయస్తంభ మెత్తించునాడు,
ఆంధ్రసంతతి కేమహితాభిమాన
దివ్యదీక్షాముఖస్ఫూర్తి తీవరించె,
ఆ మహావేశ మర్థించి యాంధ్రులార!
చల్లు డాంధ్రలోకమున నక్షతలు నేడు.

తనగీతి అరవజాతిని గాయకులనుగా
దిద్ది వర్థిల్లిన తెనుగువాణి,
తనపోటులు విరోధితండంబులకు సహిం
పనివిగా మెఱసిన తెనుగుకత్తి,

తన యందములు ప్రాంతజనుల కభిరుచివా
సన నేర్ప నలరిన తెనుగురేఖ,
తనవేణికలు వసుంధరను సస్యశ్యామ
లను జేయ జెలగిన తెనుగుభూమి,
    అస్మదార్ద్రమనోవీధి నావహింప
    జ్ఞప్తి కెలయించుచున్నాడ! చావలేదు
    చావలే దాంధ్రజనమహోజ్జ్వలచరిత్ర
    హృదయములు చీల్చి చదువు డో సదయులార!

కృష్ణాతరంగపంక్తిన్ త్రొక్కి త్రుళ్లింత
నాంధ్రనౌకలు నాట్యమాడునాడు,
ఇంటింట దేశిసాహిత్యదీపములతో
నాంధ్రతేజస్సు తీపారునాడు,
సుకుమార శిల్పవస్తుప్రపంచమునందు
నాంధ్రనైపుణి పంతమాడునాడు,
సమదసేనావ్యూహజయపతాకలక్రింద
నాంధ్రపౌరుషము చెండాడునాడు,
    చూచి, సంతోషమున తల లూచి, గర్వ
    మూచి, ఆంధ్ర పుత్రీ పుత్రు లందగలరు
    శాంతి, సందాక లేదు విశ్రాంతి మనకు;
    కంకణవిసర్జనల కిది కాల మగునె?

*

# జన్మభూమి

ఏ దేశ మేగినా, ఎందు కాలిడిన,
ఏ పీఠ మెక్కినా, ఎవ్వ రే మనిన,
పొగడరా నీతల్లి భూమి భారతిని,
నిలుపరా నీ జాతి నిండు గౌరవము.

ఏ పూర్వపుణ్యమో, ఏ యోగబలమొ,
జనియించినాడ వీ స్వర్గ ఖండమున;
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో,
నిను మోచె ఈ తల్లి కనకగర్భమున.

లేదురా ఇటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరు లింకెందు.
సూర్యుని వెలుతురుల్ సోకునందాక,
ఓడల జండాలు ఆడునందాక,
అందాక గల ఈ యనంతభూతలిని
మనభూమివంటి చల్లని తల్లి లేదు;
పాడరా నీ తెన్గు బాలగీతములు,
పాడరా నీ వీరభావభారతము.

తమ తపస్సులు ఋషుల్ ధారపోయంగ,
శౌర్యహారము రాజచంద్రు లర్పింప,
భావసూత్రము కవిప్రభువు లల్లంగ,
రాగదుగ్ధము భక్తరత్నముల్ పిదుక,
దిక్కుల కెగదన్ను తేజస్సు వెలుగ,
రాళ్ల తేనియ లూరు రాగాలు సాగ,
జగముల నూగించు మగతనం బెగయ,
సౌందర్య మెగబోయు సాహిత్య మలర,
వెలిగిన దీ దివ్యవిశ్వంబు పుత్ర!
దీపించె నీ పుణ్యదేశంబు పుత్ర!

పొలముల రత్నాలు మొలిచెరా యిచట,
వార్ధిలో ముత్యాలు పండెరా యిచట,
పృథివి దివ్యౌషధుల్ పిదికెరా మనకు,
కానల కస్తూరి కాచెరా మనకు,
అవమాన మేలరా! అనుమాన మేల
భారతీయుడ నంచు భక్తితో పాడ!

*

# పుస్తకము

నిండాఱ బాఱు నఖండగోదావరిన్
దాగిన చాళుక్యనాగరికత,
పాడైన పెనుకోటగోడల దీర్ఘ ని
ద్రలువోవు కాకతి ప్రాభవమ్ము,
పల్లెపదాల జీవము నిల్పికొన్న ప
ల్నాటివీరుల రక్తనాళపటిమ,
కడలేక యేడ్చు తుంగాభద్ర కెరటాల
మణగిన ప్రాజ్య సామ్రాజ్యభరము,
　　హృదయములు విన పలుకక చదువు చెప్పు
　　పుస్తకతపస్విని తెనుంగుపూలపొదల
　　నిలిచి సేవాశుకమ్ములన్ పిలిచి పిలిచి
　　తిరుగ పాడించు గాత జాతీయగీతి.

ఆచారమునకు దాస్యము చేయుచును వంట
యిలు దాటి రాని పూర్ణేందుముఖుల,
ఉదయాస్తమయములు నెడలిచెమ్మట లోడ్చి
క్షేత్రసేవలు చేయుసేద్యగాండ్ర,

బ్రతికినన్నాళ్లు తీరనికస్తి చెక్కలు
విరిచి జీవించెడు పేదజనుల,
తను వచో వీథులన్ తాకరా దనుచు దు
ర్గతుల ద్రోసిన చెప్పరానివాంఢ్ర,
    పూలతో నిండి కమ్మదనాలు చిమ్ము
    పుస్తకనికుంజపుంజాళిపొంత బిలిచి,
    'నా జనము, నాదు దేశ' మనంగ జాలు
    ఇంత జ్ఞానభిక్షాదాన మిమ్ము తల్లి !

ఆంధ్రుల శిల్పవిన్యాసంబు చూపించు
కలిమి గోపురములన్ గల దటంచు,
ఆంధ్రనాగరికకళ్యాణచిహ్నములైన
గానసాహిత్యముల్ గల వటంచు,
ఆంధ్రభాగ్యమ్ము మోయగ గౌతమీ కృష్ణ
దరులను నావలు తిరిగె ననుచు,
ఆంధ్రవీరులకు స్వర్గాతిథ్య మిచ్చి పా
టలు పాడిన యుగమ్ము కల దటంచు,
    చెప్పి యొప్పించు పుస్తక(శ్రీ)కుమారి
    యందగింపగ గల యాలయములు గట్టు
    డాంధ్రదేశమునం దెల్ల నాంధ్రపుత్రు
    లాప్తమానవసంఘసేవానురక్తి.

*

## ఆంధ్రమాత

శ్రీ లింపొందగ యావదాంధ్ర జనమాతృత్వాత్తలీ నూత్న తే
జో లీనామృత మాని, తద్బలవదౌత్సుక్యంబునన్ తావకో
ద్వేలప్రాక్తనకీర్తిగీతముల నర్థిన్ పాడు నీ పుత్త్రపు
త్త్రీ లోకమ్మున కేమి దెల్పెదవు సందేశంబు నాంధ్రావనీ!

ఆశల్ కౌతుకపూర్ణచంద్రికలు పూయన్, దుర్దినాచ్ఛాద మా
కాశమ్మున్ విడిపోవ, నూతనకళోత్కర్షాప్తిమై మాతృపూ
జా శోభల్ దయివారు నీశుభదినోత్సాహంబు నీక్షించి, నీ
యాశీర్వాదము లిమ్ము పుత్త్రకుల కంబా! యాంధ్రదేవీమణీ!

తేటల్ దేరెడు కాంతిపూరముల నుద్దీపించు ముత్యాల ము
ప్పేటల్ వోలె త్వదీయకంఠమున శోభింపుల్ నిగారించు, చే
నాటన్ జీవనశోషణల్ గనని కృష్ణా గౌతమీ భద్రలన్
గాటంపుం దమి త్రావువార లిదె కాంక్షౌత్కీర మాంధ్రావనీ!

ఆ చాళుక్య నృపాలరత్నముల వియ్యమ్మంది, శ్రీ కాకతి
క్ష్మాచక్రేశుల లాలనల్ వడసి, కృష్ణప్రాజ్య సామ్రాజ్యపీ
ఠీ చంచజ్జయకన్యతో సరసగోష్ఠిన్ ప్రొద్దువో బుచ్చు నీ
ప్రాచీనాభ్యుదయమ్ము నెన్నెదరు గర్వస్ఫూర్తి తల్లీ! సుతుల్.

ఉద్యన్మోహనమై, కుమారజనగర్వోద్రేకమై, ఈ త్రిలిం
గోద్యానాప్తమధూదయ మ్మగు నవీనోత్సాహపున్ వేళ, నా
విద్యారణ్య యుగంధరాముల యశోవీర్యప్రభావమ్ము లీ
విద్యాస్నాతకు లాసచేసెదరు, దేవీ! సంప్రసాదింపవే.

జాఱిన దేశగర్వమును చక్కన దిద్ది, మహేంద్రమండలీ
భారము శ్లాఘనీయముగ పాలన చేసి, సహస్రవర్షముల్
కూరిమి నాస జేయ తెనుగుం బుడమిన్ గయిసేయరయ్య, దీ
టౌరతి నాంధ్రపుత్రులు! జగజ్జనధర్మమె దృష్టి నిల్పుచున్.

ఉల్లాసమ్మున మాతృసేవ పయిపై నుయ్యాల లూగంగ, నా
పల్లీపక్కణదిగ్దిగంతరతలీ పర్యంతవేంగీభువిన్
చల్లుండాంధ్రమహోద్యమప్రథమపూజాపుష్పముల్; ప్రేమపుం
ద్రాళ్లం గట్టుడు యావదాంధ్రజనసంతానమ్ము నాపై హితుల్.

రణరక్తబంధురారుణ మైన ఖడ్గ తి
క్కన కత్తి కడిగిన కదనభూమి,
అమృతాతురవికాస మయిన యా సుకవి పో
తనలేఖిని ప్రశాంతి గనినచోటు,
భాషాకుమారి కబ్రపు పెండ్లియైన
కృష్ణరాజ్యము వెలింగిన తలమ్ము,
నానావిదేశ నౌకానీక విపులాశ్ర
యం బైన రేవు రూపఱినతావు,
పాడయి, శిలావశిష్టమై, ప్రాక్తకాల
మనుభవించుచు నుండియు నక్కటకట!

బ్రతికిచెడ్డయాంధ్రుల పూర్వవైభవములె
చాటుచున్న, వాలింపుడు శాంతమతుల!

కల దంధ్రోద్యమ వల్లరీ కుసుమరక్షాబంధ నైపథ్యతుం
దిలబాహాబహులాంజలుల్ భరతధాత్రీ ఛత్ర సింహాసన
స్ఖలితచ్ఛాయల నుజ్జ్వలింపగల భాగ్యం బింక, ఆ సాంగ మం
గళకళ్యాణము పాడ పుత్రికలె వేడ్కన్ వత్తు రానాటికిన్.

సంతోషింపగదమ్మ! ఆంధ్రజననీ! సారస్వతస్నాన వి
శ్రాంతిప్రీతుల, నీదు పుత్రకుల, దీక్షాబద్ధులం జూచి; ని
శ్చింతన్ సోదరులార! ఈ జననిపూజింపుండు బ్రహ్మోర్పణో
దంతవ్యక్తమనోబలమ్మున తథాస్తంచున్ ఋషుల్ పల్కగన్.

*

# తమ్ముడా

శ్రీలు పొంగిన జీవగడ్డయి,
పాలుపాఱిన భాగ్యసీమయి,
వ్రాలినది ఈ భరతఖండము
భక్తిపాడర తమ్ముడా!

వేదశాఖలు పెరిగె నిచ్చట,
ఆది కావ్యం బందె నిచ్చట,
బాదరాయణ పరమఋషులకు
పాదుసు మ్మిది చెల్లెలా!

విపినబంధుర వృక్షవాటిక
ఉపనిషన్మధు వొలికె నిచ్చట,
విపులతత్త్వము విస్తరించిన
విమలతల మిదె తమ్ముడా!

సూత్రయుగముల శుద్ధవాసన,
క్షాత్రయుగముల శౌర్యచంద్రిమ,
చిత్రదాస్యముచే చరిత్రల
చెఱిగిపోయెనె చెల్లెలా!

మేలికిన్నర మేళవించీ,
రాలు కరగగ రాగ మెత్తీ,
పాలతీయని బాలభారత
పదము పాడర తమ్ముడా!

నవరసమ్ములు నాట్య మాడగ
చివురుపలుకులు చెవులవిందుగ
కవిత లల్లిన కాంతహృదయుల
గారవింపవె చెల్లెలా!

దేశగర్వము దీప్తి చెందగ
దేశచరితము తేజరిల్లగ
దేశ మరసిన ధీరపురుషుల
తెలిసి పాడర తమ్ముడా!

పాండవేయుల పదునుకత్తులు
మండి మెరసిన మహితరణకథ
కండ గల చిక్కని తెనుంగుల
కలిసి పాడవె చెల్లెలా!

లోక మంతకు కాక పెట్టిన
కాకతీయుల కదనపాండితి
చీకిపోవని చేవపదముల
చేర్చి పాడర తమ్ముడా!

తుంగభద్రా భంగములతో
పొంగి నింగిని పొడిచి త్రుళ్లీ
భంగపడని తెనుంగునాథుల
పాట పాడవె చెల్లెలా!

*

# ఆంధ్ర

ఉపనిషన్మీమాంస నూరంత ప్రొద్దుల
నవధరించిన పురాణాంధ్రజాతి,
సీతమ్మ అతికష్టగీతాలు వినలేక
అడవులు పట్టిన ఆంధ్రజాతి,
కురుపాండవుల కత్తికోతల భాగధే
యము పంచికొన్నట్టి ఆంధ్రజాతి,
యవనధాటీ ప్రవాహమును బంధించి ఆ
ర్యావర్త మరసిన ఆంధ్రజాతి,
జయవదితిహాస సూత్రభాష్యములు నేడు
త్రవ్వి యెత్తిన ప్రాత ఱాదండకవిలె
జదుకోవలసెను నమ్మజాలనట్టి
కట్టుకథలట్లు, సహియింపగలవె ఆంధ్ర !

మగధసామ్రాజ్యసీమలు నీ సితచ్ఛత్ర
ముక్తాఫలచ్ఛాయ మునుగునాడు,
అల కళింగోపాంతమందు నీ కంఖాణ
ఖురధూళి నెఱసందె గురియునాడు,

కర్ణాటరాజ్యరంగములఁ నీ కవులకు
బ్రహ్మరథంబులు పట్టినాఁడు,
తంజాపురోద్యాన కుంజమ్ములందు నీ
సంగీతమధుధార పొంగినాఁడు,
అతిభయంకర శౌర్యధైర్య ప్రసక్తి
రస వశంకర నాగర రాగరక్తి
ఏకమై పాకమై ప్రవహించినట్టి
ఆ యఖండప్రభావ మే మాయె నాంధ్ర!

ప్రాకృతపదమంజరీ కంఠముల హాలు
డమృతకావ్య ప్రసాదములు పంచె,
బౌద్ధసూత్రార్థముల్ ప్రవచించి నాగార్జు
నుం డహింసాధర్మకాండ నిలిపె,
కన్నడనుడికి వంకలు తీర్చి పంపడు
తొలకరి రచనకు త్రోవదీసె,
సాహిత్యకలశంబు తూళించి పండిత
రాజు క్రొంజవుల క్షీరములు నించె,
అన్యభాషల దూరదేశాంతరముల
నుద్ధరించి ప్రకాశించియును, నిజాంధ్ర
జాతి తంతువిచ్ఛేదంబు సలుపలేదు;
లేదె నీలోన తత్ప్రభాలేశ మాంధ్ర!

తర్క మహాసముద్రమ్ము నాపోశన
బట్టె అన్నంభట్ట పండితుండు,

యావదాయుర్వేద జీవనీయచికిత్స
లు గడించె బసవరా జగదవేత్త,
జందెమ్ము తెగద్రెంచి క్షాత్రమ్ము నెగయించె
అనపోత శర్మ దేశాభిమాని,
గోలకొండకిరీటకోటికాంతులు దిద్ది
రక్కన్న మాదన్న లపరగురులు,
అఖిలపురుషార్థఫలసిద్ధి నందినారు
ఆధిదైవికభౌతికాభ్యంగణముల
నీ పితామహ ప్రపితామహోపనిధులు
మాయనీయ కాంధ్రులసంప్రదాయ మాంధ్ర!

నాదధేనువు పిండి నవనీత మందించె
త్యాగరాజ స్వామి తన్మయుండు,
లీలాతరంగిణీ కూలతీర్థానందు
డయ్యె నారాయణు డమృతమూర్తి,
శ్రీకృష్ణు కాలిగజ్జెల మ్రోతల లయించె
పదముల క్షేత్రయ్య పాటకాడు,
కావ్యమాంగల్యరేఖారుచుల్ మెఱుగార్చె
మల్లినాథ విదగ్ధవల్లభుండు,
సృష్టి నూచు సంగీతసాహిత్యకలల
నుగ్గుబాలతోడుత త్రావి యుమిసి రాంధ్రు;
లా జగన్మోహనాస్త్రము లభ్యసింప
దక్షిణము నుత్తరము జూడ దగునె ఆంధ్ర!

విఱిగివచ్చిన ప్రాణవిభునకు పసు పిచ్చి
వేడినీళ్లను తోడె కోడ లోకతె,
కత్తులతిరునాళ్ల గనయ వచ్చిన నాథు
గోఁఱకచ్చునడి దోలె కూతు రొకతె,
కులకషుల కృశించి కూలనున్న విశాల
రాజ్యచక్రము త్రిప్పె రాణి యోర్తు,
కవికోకిలమృదూక్తి సనదరించెను తేనె
నుడికారమున ఆహాహా చోకర్తు,
    విమలసాహససౌకుమార్యములు వెలయ
    దిజ్నితంబంబులందు చిత్రించినారు
    తమచరిత్ర విచిత్రపత్రముల నాఁడు;
    తలప వెట్టు లా జాతి చైతన్య మాంధ్ర!

గడ్డపాఱలు గోగుకాడలవలె ముళ్ళు
వేసినారట కొండవీటిరెడ్లు,
తెలివెన్నరాసులతీరున నల్లకొం
డలు చీల్చినారు పల్నాటిగండ్లు,
శివుని గంగనుబోలె చెఱువుగండిప్రవాహ
మాపినా రద్దంకి కాపుమగలు,
వాఁడెడేసి శిలాకవాటముల్ గ్రుద్దుల
గదిపినారట తెలంగాణభటులు,
    అట్టి బలభద్రు లీభూమి బుట్టినారు
    విజయకన్యక వీరగోరజము బూయ,

పులికడుపు చలిచీమలపుట్ట యయ్యె
చూడవోయి ప్రాల్మాలికల్ వీడి ఆంధ్ర!

పూజింపరే రెడ్డిరాజులు వీరశ్రీం
గారహారమ్ములు కానుకలిచ్చి,
సేవింపరే కమ్మ సేనాపతులు శత్రు
రక్తకుంకుమల నరణ మొసంగి,
వెలయింపరే వెల్మవీరులు బెబ్బులి
బిడ్డలై పరసీమ గొడ్డువోవ,
అర్చింపరే బ్రాహ్మణాచార్యు లుభయ భా
షా వ్యవసాయ సస్యమ్ములెత్తి,
ఈ మహాంధ్రదేశ భగవతీమతల్లి
నాదినుండి సామ్రాజ్య సమాప్తిదాక;
కులము దడివిరె? పొలిమేరగోల బడిరె?
బోయవలె తల్లిపల్లకీ మోయు మాంధ్ర!

పెనుజడల్ విరబోసికొని తాండవం బాడు
ఈర్ష్యాపిశాచి నట్టింటిలోన,
సవతిబిడ్డవిధాన నవయు తల్లి తెనుంగు
విశ్వవిద్యాలయ వీధులందు,
దోషశల్యమ్ములే తోచు నుత్సాహసం
పన్నవ్యసాహిత్య పాలనమున,
పిన్న లూర్ధ్వముఖింబు పెద్ద లథోదృష్టి
ఉభయభాగ్యోపాస్తి నుత్తచూపు;

ఈ యభావవేదాంత మే మాయఁగలదు,
చావుబ్రదుకులు తేలు నీ సంధియందు,
'నాదుజాతి - నాదేశము - నాదుభాష'
అను అహంకార దర్పన మందు మాంధ్ర!

*

# తెనుగుతల్లి

శ్రీకాకుళస్వామి సిగపై సువాసించె
తెల్లని ఆంధ్రుల మల్లెపూలు,
ఒడ్డెరాజుల జీవగడ్డ గ్రక్కదలంగ
కోరాడె మత్తాంధ్రకుంజరములు,
చీకటిమన్నెముల్ ఛేదించి నవధాన్య
ముల నెత్తె ఆంధ్రుల పోపుటెద్దు,
చిలుక సరస్సులో శృంగారనౌకల
నడిపె ఆంధ్రుల యింటి పసుచుజతలు,
ఉత్కలాశానితంబమ్ము లొత్తి హత్తె
ఆంధ్రుల యశోదుకూలసితాంచలములు;
తమ్ముడా! మాయనిత్తువే తల్లివన్నె?
చెల్లెలా! చిన్నబుత్తువే తల్లిచిన్నె?

నాగార్జునాద్రి కంఠముల గండూషించె
పలుభాష్యబంధమై తెలుగుశిక్ష,
ప్రాకృతాశ్రమ వాటికాకులమ్ముల నాటె
తీయమామిడి యంట్లు తెనుగుకవిత,

బౌద్ధ ధర్మరహస్యభాసముల్ పఠము తా
త్త్వికదృష్టి విడదీసె తెనుగుప్రతిభ,
కొండలోయలలోన కోమలలావణ్య
మలరార చిత్రించె తెనుగుకుంచె,
  గంగ తలనుండి కావేరి కాళ్లదాక
  వెలిగె దిఙ్మోహనమ్ముగా తెలుగుకీవి,
  తమ్ముడా! మాయనిత్తువే తల్లిసన్నె?
  చెల్లెలా! చిన్నబుత్తువే తల్లిచిన్నె?

పంజాబునుండి కస్రపు మొక్కలను దెచ్చి
పెరటి తోటలలోన పెంచినారు,
పచ్చి జవ్వాజి గోవానుండి తెప్పించి
దంతంపు జాడీల దాచినారు,
కొండవీటి గులాబి గుత్తుల అత్తర్లు
కీలు తిత్తులలో బిగించినారు,
అసలైన పారసీకాశ్వాల నలవార్చి
విజయయాత్రల స్వారి వెడలినారు,
  సాంగజీవిత కళ్యాణ శాఖక్రింద
  నిలిచి ఆనంద దేవతన్ గొలిచినారు,
  తమ్ముడా! మాయనిత్తువే తల్లిసన్నె?
  చెల్లెలా! చిన్నబుత్తువే తల్లిచిన్నె?

మోటుపల్లి తీరమున లంగ రేసి ఓ
డలు సుంక మర్పింప నిలుచునాడు,

రాయలసీమ రా రాయబార్లు వసించి
చిత్ర చరిత్రల్ రచించునాడు,
పాకాలచెరువు చెంపల పండు ధాన్యముల్
అన్యదేశాధీశు లడుగునాడు,
అద్దంకి కోడెల నాబోతులకు నయి
దూరాగతులు కొని త్రోలునాడు,
    ఖండ ఖండాంతరములన్ ప్రకాశమయ్యె
    తెనుగుతల్లి లాలాటికా తిలకదీప్తి
    తమ్ముడా! మాయనిత్తువే తల్లివన్నె?
    చెల్లెలా! చిన్నబుత్తువే తల్లిచిన్నె?

నందనోద్యాన సౌందర్యమ్ము నెగబోయు
గోదావరిముఖాన కోనసీమ,
సుఫలసంపత్సస్య సురభియై మెఱయు కృ
ష్ణా రసశ్యామ గుంటూరు సీమ,
ధవుని పోరి కదల్చి కవిని నేరిమి గెల్చి
మీరిన జాణ నెల్లూరి సీమ,
ఆంధ్ర దిగ్జయపతాకాలంకృత మ్మైన
రతనాలయంగడి రాయసీమ,
    నేల నాలుగు చెఱగుల నిగ్గుదేలె
    రాణ సూయాణమై తెలంగాణరేఖ,
    తమ్ముడా! మాయనిత్తువే తల్లివన్నె?
    చెల్లెలా! చిన్నబుత్తువే తల్లిచిన్నె?

## ఆచారము

తీరు తీరుల నలంకారముల్ ముగ్గులన్
చిత్రించు మవ్వంపు చేతిమేల్మి,
పూసలతో బొమ్మపోసినయట్లు చ
క్కని కుట్టుపను లల్లు కౌశలంబు,
కైవారములు లేకయే వలయము లష్ట
దళరేఖల నమర్చు కలికితనము,
పాడేటి రాటాల పాలు తీసిన రీతి
సన్నదారము దీయు జాణతనము,
    తెనుగునాటి కులస్త్రీల ననుదినంబు
    సన్నసన్నగ నణగారి చచ్చుచున్న
    దకట ! ఈ గృహజీవదీపికలు నిలువ
    స్నేహనిధికి భిక్షాటన సేయ రేమొ !

ఏడాది పొడుగున నింత తీఱిక లేక
చేలలో కష్టించు సేద్యకాండ్ర,
పెద్దపురాణాల విన నోచుకోనక యూ
రికి దూరు లగు దురదృష్టజనుల,

ఉప్పుకల్లుకు గూడ నెడ లమ్మవలసిన
ఆధార శూన్యులౌ అనదవాంధ్ర
ఇంటి బానిసచాకిరే సర్వ మని తూర్పు
పడమర లెఱుగని పల్లెసతుల,
ఎవ్వ డింక తాంబూర వాయించుకొనుచు
దరిసినదుపు ప్రజాహ్లాదతంత్ర మెపుడు ?
అన్నకాటక మటు లుండ నావహించె
భూమి నానంద దుర్భిక్షమును సఖుండ !

వినువారి కన్నీరు వినువాకగా బొంగ
సీతమ్మ కష్టాలు సెప్పిచెప్పి,
వెఱ్ఱిగొల్లను గూడ నుఱ్ఱూత లూగంగ
వీధిభాగవతాలు వేసివేసి,
ముసలివాండ్రను మీసములు త్రిప్పి కాకెక్క
వీరబొబ్బిలి కథల్ వినిచి వినిచి,
ఆబాలగోపాల మావేశమున త్రుళ్ళ
పల్నాటియుద్ధాలు పాడిపాడి,
పల్లెపల్లెను ప్రాణాలు పచ్చగిల్ల
జాతిసుఖము పోషించితి సర్వకాల
మెచ్చట నురింగిపోతివో బిచ్చకాడ ?
కవివి పాటకుడవు నీవె గావె సఖుడ !

బువ్వమ్మబంతులన్ కవ్వించి వయసు కా
వర ముబ్బ పడతులు పాడలేరు,

గొబ్బి తట్టెడువేళ గూడ ప్రాయపుకన్నె
లరమర లే కాడ మఱచినారు,
తద్దెపండుగుల సైత ముయ్యాల లూగుట
మోటుగా ముగ్ధలు మూసినారు,
రుక్మిణి మొదలుగా రుచిగొన్న బొమ్మల
పెండ్లిండ్లు బాలలు విడిచినారు,
ఏ నిరపరాధ మగు క్రీడ లింతవఱకు
జాతిముఖతిలకము లైన చానలందు
పెంచె నానంద సౌందర్య సంచయమును,
ఆ శుభము లస్తమించెడి నరయ రేమొ?

*

# తెనుగు మాన్యము

వంశిన్ వంచి, మృణాళమున్ మెలిచి, పక్వద్రాక్ష నెండించి వా
గంశల్ మార్దవమాధురీ సుభగవిన్యాసంబు జిల్కన్, దశ
త్రింశల్లక్షజనప్రసన్నరసనా దేవాలయాభ్యంతర
ప్రాంశుప్రార్థనగీత మైన తెనుగుంబల్కున్ ప్రశంసించెదన్.

పాలక్రొమ్మీగడల్ పచ్చివెన్నయి విచ్చి
తీయని నునుపూస లాయె నేమొ?
కమ్మని మకరందకణములు స్నేహించి
చిన్నారిపలుకులై చిక్కె నేమొ?
పూలలావణ్యంబు పొంగి చక్కదనాల
పిండులై రుచు లెక్కి పెరిగె నేమొ?
సెలయేటి యొయ్యాల కులుకుటొయ్యారముల్
ముద్దుముచ్చట లయి ముదిరె నేమొ!
పాటకును పద్యమునకు నమ్రముగ నొదిగి
చవికి చాతుర్యమునకు సాజముగ సాగి,
పోరునకు పొత్తునకు చాలి పొందిపొసగు
మా తెనుగుతల్లి మెడ కిదే మల్లెదండ.

నన్నయభట్టు భారతమునన్ జతియించెను సంస్కృతంబుతో
కొన్ని తెనుంగు లేరి తనకూర్పున కొప్పినయంత; కాని యా

వన్నిబడాంధ్రలోకముఖభాషితమై, శ్రుతిసేవ్యమాన జీ
వన్నవనీతమా తెనుగు పాలసముద్రము పుక్కిలించెనే !

ఈనిన ఆలమందగతి, ఇంపు లిగిర్చి ఫలించినట్టి యు
ద్యానముపోల్కి, సస్వరమ యాడెడి వేదికబోలు నీ తెలం
గాణమునం దనంత సుముఖస్వరజీవనమైన శబ్దసం
తానము నేల తిక్కనవిధాత తెనుంగుల జాతు లేర్పడన్.

సంధికి వచ్చి, సంపకపుసంగతి సంతయు గట్టిపెట్టి, ఆ
యంధుని వార్ధకంబె పరిహారము అన్నిటి కంచు జూపి, శాం
తిం ధరియించు టొప్పని ధ్వనించెడి పట్టులగూడ, వైఖరీ
గంధము మోసె తెన్గునుడికారమె తిక్కన సిద్ధవాక్కునన్.

తలకొను రాణ్మహేంద్రవర తార్కికులన్ పడదిట్ట, నర్మసూ
క్తుల నుసికొట్టుజాణల నెదుర్కొన, హర్షుని ప్రౌఢకన్యకన్
తళుకు పసిండికంచ మరణం బిడగా, కవిరాజు పాలిటన్
మెలగదె కామధేను వయి నింపు తెనుం గఖిలార్థసాధనన్.

భ్రమరపదంబులందు భగవత్ప్రకృతి ప్రణయానురాగ త
త్త్వమును సమన్వయించి, పసిపచ్చికమేయుచు తప్పిపోవు వ
త్సములకు కృష్ణగానమున దారులు సూపి, సుధాధునీతరం
గమ్మృదుమృదంగభంగి కవికాంతుడు పోతన విన్పె తెన్గునన్.

మొగ్గలు నవ్వి పువ్వు లగుపోల్కి, ప్రబంధకవాటపంక్తులన్
నిగ్గుతెనుంగుతోరణపు నింపుకళల్ సొగసార, రంగులన్

మ్రగ్గినచిత్రసౌష్ఠవము, రాగములన్ రవళించుహాయియున్,
బిగ్గ గవుంగలింప దొరకొ పెద్దన భవ్యశిరీష భారతిన్.

త్రిభువనసుందరీకులకిరీటము సత్య; తదీయ గర్వసా
రభము, పరాభవజ్వరభరంబును, వాసెనకట్టుచీర, కో
ప భవనవాసమున్, కటికిపానుపు, కృష్ణునిరాక, ధూర్తవా
గభినయలక్షణంబు లలరారవె తిమ్మన ముద్దు తెన్గులన్.

పొలమును సాగదున్ని, పసిమొక్కలునాటి, ఝరీపయస్సులన్
మెలపుగ ద్రిప్పి, పెంపు గమనించి, సుపర్వవిపాక మందు గో
సి, లలితపుం బరంజముల చిక్కనిపాలను కాచి, శర్కరో
పలములు పంచె నీ తెనుగు వాకిట సూరనకావ్యపుత్రికల్.

తంబురతీవెలన్ తొణకుతానము, వల్లకి పల్లవించు రా
గంబులు, పిల్లవేణువుముఖంబున గుల్కు సుఖస్వరాళి, యే
కం బయిన ట్లొయారి నడకన్ బహుళాభరణాళి యాడి పా
డం బయకారి తెన్గురవలన్ జవకట్టదె భట్టుమూర్తియున్.

సరళపదాల భావమయసాహితి నేలిరి సత్కవీశ్వరుల్;
స్వరమయ రాగకీర్తనల స్థాయిసుఖం బెలయించె నాద త
త్పరు డయి త్యాగరాజు; భగవత్కళ దిద్దిరి రంగురేకలన్
నిరుపమసిద్ధహస్తు లగు నేర్పరిశిల్పు లజంత లోయలన్.

పరిణత వాక్కు లస్మదనవద్యకలాకవితాపితామహుల్
స్థిరముగ నిచ్చి రీ తెనుగు దీయనిమాన్యము, నిందు నూత్నవ

ల్లరులను, క్రొత్తయంట్లను, ఫలద్రుమజాతుల నాటి పెంతు సంబరమున నే వనప్రియలు మంచెలపై నెలుగెత్తి పాడగాన్.

అందదు నిర్వికారము నిరంజనమా పరతత్త్వ రేఖ; ఆనందమె నిర్గుణాన సగుణానను ప్రాప్యమయౌట, మాతృమూర్తిం దరిశింతు నీ ప్రకృతి దివ్య శుభావరణాన, తత్స్వయోబిందువు లాను బిడ్డవలె వింతస్వతంత్రముతో నహర్నిశల్.

*

## కీలకము

ఎన్నాళ్ళ కొచ్చావె చిన్నారి చిలక !
కన్నారి చూచిన ట్లున్నాది చిలక
దానిమ్మ గని నిన్ను తలపోస్తి చిలక
లే నిమ్మ దరి కేగలే కొస్తి చిలక !

బింబాల చూచి కంపించానె చిలక
తాంబూర శ్రుతి కెంతో దడిశానె చిలక
వంశకీర్తన విని వణికానె చిలక
మదిలోని రొదలకే అదిరానె చిలక !

అద్దాల కెదురుగా అడలానె చిలక
చిత్రాలు కనులకున్ చెఱ లాయె చిలక
వెన్నెల జేలకే వెఱచానె చిలక
కొమ్మలతో చెల్మి కొలిమాయె చిలక !

గువ్వ జంటల చూచి గునిశానె చిలక
సందెరాగము గాంచి జంకానె చిలక
అడవి పూవులతావి కలిసానె చిలక
గందంపు నీడలన్ కాగానె చిలక !

తల యెత్త తారకల్ ఉలికించె చిలక
చెవి యొగ్గ కోయిలల్ చెండాడె చిలక
పడుచు కోర్కెలులోన ఉడికించె చిలక
లజ్జ దాగుడుమూఁత లాడించె చిలక!

ఉత్తరమ్ము లిఖింప నుంకించి చిలక
కలగి వీథులలోన మెలగితిన్ చిలక
మొగలి పూ బొదలలో మునిగితిన్ చిలక
తీయ పొత్తులకునై తిరిగితిన్ చిలక!

నా చేతు లంటి స్వప్నము లయ్యె చిలక
చక్కని గేదంగి టెక్కులున్ చిలక
నా యూర్పులకె వాడి నలు పెక్కె చిలక
నవనవలాడు పల్లవపాళి చిలక!

చైతన్య మయ మైన జగతిలో చిలక
వెదకితిన్ దూతకై విను వేది చిలక
తల లూఁచె జాలితో తరు లెల్ల చిలక
సరసులున్ కదలకే మురపిల్లె చిలక!

మెలగడే యక్షుకై మేఘుండు చిలక
కదలదే నలునకై కలహంస చిలక
కలికి దౌత్యము చేయ కాబోలు చిలక
సుదతి ప్రార్థన మెంత చులకనో చిలక!

*

## 3

## ప్రతిభా చక్రము :

### శ్రీ రవీంద్ర కవి

పకపక నవ్వేటి పసిబాల పెదవులన్,
పొడుపు వన్నెలు పూచు పడతి క్రాల్గన్నులన్,
చనుబాలు జడిగొనే జనని నిండు మొగాన,
ప్రేమ కళాంశలే వీక్షించి నావు
కోమల హృదయాన గురుదేవ! నీవు.

ఋతవాదనము సల్పు ఋషుల మంత్రములలో
భువనముల్ పొగయించు పోతయంత్రములలో,
బ్రహ్మాండగర్భ గహ్వార సుప్తమై యున్న
ప్రాణ బలంబులన్ భాగించినావు,
సూక్ష్మదృష్టి రవీంద్ర! సుకవీంద్ర! నీవు.

సురభిళ కుసుమ మంజులకుంజ కులములో,
అత్యమూల్యము లైన ముత్యాల సరులలో,
ఆవేశ మధుకోశ మయిన గీతాంజలిన్
చైతన్య రుచులనే సవరించినావు
సూక్తి సూత్రమునందు సుకవి రవీంద్ర !

భాను భానువులందు ఫలియించు తేజస్సు,
పవన తాండవమందు ప్రవహించు ప్రాణంబు,
ప్రియ రసోపాసనన్ పెరుగు ప్రేమాంకుర
దోహదంబున కయి దోయిలించితివి,
ఆనంద వీథీవిహారివై సుకవి!

జ్ఞానయోగులు గోరు ఆనంద సంసిద్ధి,
కర్మయోగులు పొందగల స్వర్గ సౌఖ్యంబు,
భక్తియోగులు ఆసపడెడు కైవల్యంబు,
శాంతి నికేతనాశ్రమ సాలముల నీడ
సాధించితివి విశ్వ సౌందర్య పూజ!

కత్తులు దూసేటి కాళ రాత్రులలోన,
ఆకలి దహియించు ఐశ్వర్యముల మధ్య,
పండిన ఫలవృక్ష వాటిలో నెలుగెత్తి
కోయిలవలె ప్రేమ కూజితంబు లొనర్తు,
సకల మానవలోక శాంతికై సుకవి!

హృదయ ద్యుతులతోడ రేఖింతు రూపాళి,
నాత్మశ్రుతుని గల్పి ఆలపింతువు గీతి,
భవదీయ వర్చస్సు బలియు నావరణాల
అలసేను కంఠంబు, సొలసేను లేఖినియు
సహృదయాంబరశరచ్చంద్ర! రవీంద్ర!

విరియునే జాతుల విద్వేషతమ మెల్ల ?
ఆఱునే దేశాల అర్థదాహ మొకింత ?
మాతృదేశం బిచ్చు మధురాన్నపానాల
స్వేచ్ఛగా సుఖియింతురే యెల్ల ప్రజలు
ఆ యనంతుని లీల లనుభవించుచును ?

*

## శ్రీ శివ శంకర శాస్త్రి

కన్నె చెక్కిళ్ళలో కవియు రంగులు తీసి
చిఱుసిగ్గురూపాలు చిత్రించు నెఱజాణ,
సోదరీ సుస్నేహ సుఖరక్త బంధాల
ప్రేమసాధనసిద్ధి గామించు శుభశాలి,
ప్రాణేశ్వరీ పాదపద్మ చక్రము పొంత
ఆనందసూత్రార్థ మన్వయించు తపస్వి
    కవి యౌను; కవి లేక, కథ లేక, కళ లేక
    ఈ యాత్ర ఏతీరు తీయ మోయి కవీంద్ర !

రజనిసందిలి వీడి రాలేక రాలేక
వెనుకముం దాడేటి విరహ గంధవహుండు,
నిండు టెక్కులక్రింద నిదురించు నెలకూన
లను లేప పాడేటి నునుపుల్గుబాలెంత,
తూర్పు వాకిలి ముందు తొగరు వన్నెల నూలు
అలవోక నడికేటి అరుణాంశుక కుమారి
    నీ స్వప్న నగరాల, నీ పచ్చ వాకిండ్ల
    సవదరించుత రుచుల్ శివ శంకర కవీంద్ర !

తొలి తొల్కరింపు చక్కిలిగింతలకు లొంగి
తను సువాసన లిచ్చి తనువు మెత్తని తల్లి,

బొగ్గు తున్కలు లోన మ్రగ్గి సగ్గిసలాడ
రతనాల కాన్పులన్ రాణించు కళ్యాణి,
సఫల పుష్పక్షీర సరసాన్న భోగాలు
దిన దినంబును ప్రసాదించు పంటల దేవి,
ఈ తెలంగాణంబు ఈ తేనె మాగాణి
నీ మృదూపాసనన్ నిలువ నిమ్ము కవీంద్ర !

ఆ వేదబుక్కులన్, ఆ మంత్ర వాక్కులన్
అంది యందక యున్న యజ్ఞపూరుష రేఖ,
ఉపనిషత్సూత్రాల, యోగాది శాస్త్రాల
నిలిచి నిల్వక మించు నిర్వికల్ప బ్రహ్మ,
తర్క వాదాలలో, తత్త్వ భాష్యాలలో
చూచి చూడగరాని శుద్ధ విజ్ఞానాంశ
వీడ వీడగ లేక నేడు పట్టితి నిట్లు
తల్లి చల్లని కొంగు తండ్రిజాడ నెఱుంగ !

*

# శ్రీ సరోజినీ దేవి

చైత్ర పల్లవముల సరిక్రొత్త రుచులలో
పరిమళం బెగబోయు బాలపూమిళ్లలో
తీయగా రాగాలు తీసేటి కోయిల
    హృదయంగమ శిరీషమృదుమంజు ఫణితి
    నేర్పె నేమొ సరోజిని దేవి ! నీకు.

తామర తూండ్లలో ధవళ తల్పము మీద
అల లూప హాయిగా నాడుచూ పాడుచూ
విశ్వమోహనముగా విహరించు కలహంస
    నేర్పె నేమొ సరోజినీ దేవి ! నీకు
    ముద్దుల మాటలా నిద్దంపు నడల !

పన్నీటి సెలయేళ్లు ప్రవహించి నట్లుగా,
సన్న తంతులవీణె సవరించి నట్లుగా,
పాడినా వానంద బంధ సుందరగీతి
    స్వాదు పదావళీ సామ్రాజ్యమునకు
    రాణివై, కవన కల్యాణివై నీవు.

పా లెండిపోయిన పాడి యావుల చూచి,
పూత పూయని గొడ్డుబోతు తీవల గాంచి,
అనుతాపమాలలన్ ఆగ్రహజ్వాలలన్

వర్షించితివి సుప్తభారతుల్ లేవ
కామాక్షివై, మహాకాళివై నీవు !

దౌర్భాగ్య భారత తంత్రతంతులు త్రెంప,
సౌభాగ్య భారత జాతకమ్ము రచింప,
సౌందర్య మాతవై, స్వచ్ఛందదూతివై
భోగిపండుగ పాలు పొంగింపగా వచ్చి
నావె సరోజినీదేవీమతల్లి !

*

# ఆచార్య రాధాకృష్ణ

పృథివీగోళ మహః ప్రసన్న సుజలాప్తిన్ ముక్త మాలిన్యమై
పృథులాన్న స్ఫురదోషధీమహిమలన్ శేకొత్త, ప్రాణాంబర
ప్రథమోచ్ఛ్వాస మనన్ ధ్వనించెతొలిఏ బ్రహ్మానువాకంబు, త
న్మధురాలాపమె మాఱుమ్రోగెడిని రాధాకృష్ణ వాగ్వల్లకిన్.

యజ్ఞమే సకల ధర్మార్థ సాధక మంచు
విధియించు వైదిక విద్యదుక్తి,
జ్ఞాననిష్ఠయె సమస్త ప్రాప్యములకు సూ
త్రం బను ఉపనిషత్తత్త్వసూక్తి,
కర్మసంసిద్ధి యొక్కటె ఆద్యపరమార్థ
మనెడి మీమాంసక న్యాయపంక్తి,
భక్తియోగమె మానవసముద్ధరణము మార్గ
మని చాటు గీతామహావచస్సు,
ఏ యవిచ్ఛిన్న ధారాప్రమేయరాగ
మం దభిన్నభిన్నశ్రుతు లయి లయించు,
నా యతీత విజ్ఞాన సమన్వయమును
తెలిపినావు రాధాకృష్ణ ధీనతంస !

కాలము చక్రమట్లు తిరుగన్ తలక్రిం దగు పట్టుడాకులన్
బోలెయుగ ప్రమాణపథమున్ భ్రమియించెను, ప్రాచ్యలక్ష్యముల్

తూలెను దృష్టిభేదములతో, నెగబోయు బ్రతీచ్యభావ వా
తూలము స్థూలయంత్రముఖదూషితమై రభసింప లోకముల్.

ప్రకృతి గర్భము గోసి, శాస్త్రములు చీల్చి,
వెదకుదురు పరిశోధకుల్ విసుగు లేక
శక్తితంత్రప్రయోగ కౌశలము కొరకు
జ్ఞానకృషి కెందు నమృత బీజములు లేమి.

త్రవ్వుదురు బొగ్గుకొఱకు పాతాళములను,
వెదకుదురు పొట్టకై నవద్వీపములను,
పగలు రే లయి రేలును పగలు గాగ;
యంత్రమహిమయె నిండు బ్రహ్మాండ మెల్ల.

కామ్యచోదిత మయిన విజ్ఞానదీక్ష
వెదకును ప్రయోగకల్పన విధముమాత్ర,
చూడదు తదుపసంహార సూత్రసరణి;
మారణ మెఱింగి, రేది నివారణంబు ?

రేగు నతిసంచయేచ్ఛ, తీండ్రించు కాయ
సుఖపిపాస, ప్రజ్వలియించు నిఖిలనియమ
వృత్తవిచ్ఛేద నాస్థ, ఈ వికృతియందు
దారి చూపగలా డొక్కఁ తాత్త్వికుండె !

క్రైస్తవ ధర్మవాఙ్మయ మహోదధి బోవు
పడవకు చుక్కాని పట్టినావు,

జినబుద్ధదేవభాషిత రత్నములను శా
ణిత మొనర్చితివి తద్ద్యుతుల నరయ,
ప్రకృతిశోధకుల తాత్త్వికభావరూపంబు
లను ఘటీయంత్రముల్ సైచినావు,
ఆర్యదార్శనికుల అద్వైతవీథుల
జ్ఞాన భిక్షాటన సలిపినావు,
    శాంతి చెడి, కన్ను చెదరి, లక్ష్యము కుదురక
    సంశయాత్మక మయిన యీ సమయమందు,
    యోగ్యు డెవడు నీకంటె నీ యువజనంబు
    నుద్ధరింప రాధాకృష్ణ యోగశాలి !

*

## కృష్ణరాయ నాగేశ్వరులు

సృష్టి విపర్యసింప, గ్రహరీతు లధోముఖమై చెడన్, క్రియా
క్లిష్టత భూతముల్ కళవళింప, త్రిశూల ముఖాగ్ని మాలికా
జుష్టములై దెసల్ మసల, శుద్ధసమాధి నటించు తాండవ
ద్రష్ట వినిస్పృహాభినయ రాగము బ్రోచుత సూత్రధారులన్.

అసిధారాశిత మైన యర్జున తపోయజ్ఞాగ్ని దీపించి, తై
జస ధారాదృతతోయతోషిత సుసస్య శ్యామల క్షేత్రమై,
కసటుల్ పాయగ బౌద్ధధర్మ నయదీక్షన్ బొంది, ఈ కృష్ణవే
ణి సమస్తాంధ్ర కథాకిరీటముఖ మాణిక్యంబుగా భాసిలున్.

భారత మాతృకంఠమున ద్రావడ కింత సముద్యతద్యుతిన్
మీఱు ప్రభావమాల నడిమిన్, సుకుమార విదగ్ధ కల్పనా
పూరణముగ్ధమై కొలికిపూసగ నొప్పు మహాంధ్రనాయక
స్ఫారఫలాంశ, తత్కళ కుమ స్సగు గాత తెనుంగుతోటలోన్ !

కత్తివోలె ననిష్ట రంగములు చీల్చ
తూలిక విధంబున నభీష్ట తోరణముల
నందగింప, శ్రీకృష్ణరాయని కలంబు
మాఱు, నిగ్రహానుగ్రహ మహిమ మంద్రి.

ఆంగ్ల దండ్యాచార్యు డగు 'అరవిందుని'
బహ్వర్థ పద భావభంగి తెలుప,

పరతంత్ర భాష్య ప్రసక్తియా 'విపిన చం
ద్రుని' నవ్యవాదము తెనుగు చేయ,
'చిత్తరంజనుని' విశిష్టనీతివ్యూహ
మునకు పూర్వోత్తరములను చూప,
'మోహనదాస' వాక్పుష్పములం దహిం
సా మధుసారము సంగ్రహింప,
నేర్చు శ్రీకృష్ణ రాయని నిశ్చయ ప్ర
చండలేఖిని వేషభాషలు హసింప,
ఆంధ్రులకు నవ్యభావన నలవరించి,
ఆంధ్రమున తీక్ష్ణగుణశైలి నభిఘురించి-

అతి వికారములుగా నగపడు 'వంగ చి
త్రముల' యాంతర్య సౌందర్య మెన్న,
పాశ్చాత్య పౌరస్త్య బహుళ వాఙ్మయముల
సామ్య వైషమ్య బీజములు వెదుక,
ప్రాత క్రొత్తలు జతపడక భేదించు ధ
ర్మానువాకములన్ సమన్వయింప,
అర్థవంచిత మైన యభినవ రాజ్యాంగ
ముల దృష్టి దోషమున్ పుడిసిలింప,
అంబరం బంటిపోవు నూహాజగత్తు
నర్థవద్వాక్య జాలములందు బట్ట,
సాధనయు సాధకుడు నయి సంస్కరించు;
'కృష్ణ' నుద్దీప్త మొనరించు 'కృష్ణు' కరము.

ఆర్థిక ప్రణాళికను, పరమార్థతత్త్వ
మాలికను గూడ నేకప్రమాణదృష్టి
నారయుచు భక్తపరిభాష ననువదించు
శ్రద్ధ తొలక నాగేశ్వర రాయ కలము.

భోగరతిప్లుతం బయి, యమోఘరుచిం బడి అర్థబద్ధమై
యాగెడి వర్తమానజగదుల్బణ వైఖరి గాంచి, పశ్చిమా
శాగతి బట్టి పోవు ధనశైవలినిన్ మరలించి; తార్జన
త్యాగము లొక్కటే యగును స్వార్థవిహీనున కంచు దెల్పగన్.

నాగలికఱ్ఱు కోనం బడు భూదేవి
సస్యములను పెంచి జనుల కొసగ,
బహుపార్థివ ప్రాణబలసంగ్రహ మొనర్చు
ఫలరూపమున తరుల్ ప్రజల కీయ,
తాను తపించు నుదధియు వర్షాకృతిన్
ప్రాణికోటికి పయః ప్రాప్తి చేయ,
విధినిషేధములు పోవిడుచు కృశానుండు
లోకకర్మల పవిత్రీకరింప,
కర్మచక్రారపంక్తి చక్కన గదల్ప
చాలనోపకరణ మగు సంచయేచ్ఛ
నీ యమృతకల్పనము లేక నిర్ధనాంధ్ర
దేశ మేమూల బడెనో నాగేశ సుకృతి !

అడిగిన లే దనుచు నెన్నడేని నా
లక్కకు రాని యర్థార్థి కల్పశాఖి,

రచియింతు మనుచు చేరఁగ శతసత్రముల్
వ్రాయకుండని కావ్యరసికమౌళి,
చిత్రింతు మనుచు వచ్చిన పిడికిళ్ళ ని
యక పోవనని కళాభిమాని,
ఆశ్రమస్థాపన మన్న వేయాలు స
మర్పింప కుండని త్యాగరాజు,
ఖండ ఖండాంతరమునుండి గంగబోలె
నింటి కేతెంచు ద్రవ్యవాహినికి పెక్కు
గండ్లు గొట్టి సంతోషించు కర్మయోగి;
ఈశ్వరుం డీయ డేల నాగేశ్వరునకు.

గ్రంథాలయముల నాకర్ణించు శారదా
శ్రుతి యైన కవుల యమృత వచస్సు,
గోపురాగ్రముల మేల్కొనియున్న కలశ శే
ఖల నూర్ధ్వమార్గ సాంగత్య మెంచు,
ఐశ్వర్య సిద్ధియం దనుభవించు దరిద్రు
లయిన భారతుల యర్థాన్నభుక్తి,
నీతి సూత్రములు పేనిన హస్తముల నహిం
సా తంతు కరణ కౌశలము నెరపు,
నిందను వదలి వక్రోక్తిని త్యజియించి,
ధృతి సజాత శాస్త్రనవపథ మెన్నుకొంటి;
వాభిజాత్యము 'పత్రిక' యభ్యసింప
పుత్రికవలె, నాగేశ్వర సూత్రధారి!

గీర్వాణమును ద్రోసి కీలించె ధర్మ మా
ర్గ మశోక నృపమౌళి ప్రజల భాష,
అఖిల వైష్ణవ మతాధ్యయనంబు రామాను
జ స్వామి ద్రవిడభాషనె విధించె,
భాష్యపంక్తులు వీడి పాడిరి శైవ ద
ర్శనము కర్ణాటకుల్ షట్పదులను,
పంచమ వేదమున్ బంధించె వాగను
శాసనుండు తెనుంగు బాసయందు,
ఈశ్వరుని సొత్తయిన జ్ఞాన మెల్ల ప్రజల
కెల్ల యెడల సేవ్యమే యను నొక కలిమి;
నఖిల పౌరకర్మల కా రహస్య మిపుడు
సర్వతోముఖ కారణ శక్తి యయ్యె.

*

## రామలింగా రెడ్డి

చైత్రపల్లవ దూతి చక్కిలిగింతలన్
గుస్తరింపగ పాడు కోకిలంబు,
జలక మాడిన నభోజనని ఘనాలక
లాఱ విప్పినవేళ నాడు నెమిలి,
పండువెన్నెల జున్నుబాలు చేపిన రేల
'స్వరజతుల్' వల్లించు భ్రమరబాల,
దానిమ్మ పగడాల కానుపు గనునప్డు
నామకీర్తన సల్పు రామ చిలుక,
   ప్రాణిలోకము, రసవదిష్టార్థరక్తి
   ననశ మగునప్డె యున్ముక్త యగును కవిత;
   రచన లేక, రాగము లేక, రసము లేక,
   ఈ జగద్యాత్ర శోభిల్లునే సుధీంద్ర !

కావ్య సౌభాగ్య రేఖలను మీమాంసించి
తెలివని వాకిండ్లు తెఱచినావు,
ఆంగ్ల భాషీయవాహన మధిరోహించి
గిలకొట్టి కదను త్రొక్కించినావు,
కఱకు మెత్తదనాలు కలిసి పైకొన వాద
వేదికాగ్రముల కవ్వించినావు,

అతి నవీనుడ వయ్యు అనుగుతల్లి తెనుంగు
నుడికారపుం జవిన్ మురిసినావు,
ఉత్తమాధ్యాపకుడ వయి యొప్పినావు,
విశ్వవిద్యాలయము మోసి వెలసినావు,
సహృదయస్వామివై కళల్ సాకినావు,
కట్టమంచి రసాల శాఖా ఫలంబ !

మత్స్యగంధి సమీపమందు ముగ్ధుం డయ్యె
ధీరవచస్వి భట్టారకుండు,
సంజయ వాక్యార్థ చాలనన్ పొడకట్టె
చోద్య చోదకభాషి సోమయాజి,
రెడ్డిరాజుల చాటురీతి వీధుల దోచె
నవరసమూర్తి శ్రీనాథ సుకవి,
శాలీను ముఖమున సాక్షాత్కరించె న
వ్య క్రాంతదర్శి సూరన్న ప్రోడ,
లక్ష్యలక్షణ రూపకల్పనలయందు
ద్యోత మగు నుదాత్తుల సంప్రయోగ రేఖ;
అట్లె బింబించెదవు భవదాత్మ సురభి
శామల వచోముకురమందు రామలింగ !

*

# కలియుగార్జునుడు

కూరిమి వీర దంపతులకున్ జనియించిన భారతీయు లా
చారతపోధురీణు లయి సాధన చేసి గడించి రే ద్విష
ద్దారణ దారుణం బయిన ధర్మధనుస్సు, తదీయ తేజ మిం
పారగ గాచుతన్ కలియుగార్జును అప్పయధన్వి నెప్పుడున్.

విన్నాము కడుపులో నున్న కండలు కద
లంగ భారత రణరంగ చరిత,
చెవి యొగ్గినాము పుచ్చినశల్యములు మాంస
గింప రామాదుల యంపకోత,
ఆలించితిమి గుండె లదర పల్నాటి వీ
రుల గండ్రగొడ్డండ్ర రోషపదము,
అవధరించితిమి కన్నవనేడి యొఱు పెక్క
రాజపుత్రుల యల్లెత్రాళ్ల మ్రోత
భావమున; నంతె కాని మా పాపవశత
చూచినది లేదు, చూడగా నోచ లేదు;
నేటికి ధనుస్సు నెత్తి సంధించినావు
మా యదృష్టం బిదియె అప్పరాయ ధన్వి!

వ్రాసిన వ్యాసవాక్యముల భావభరం బెఱుగంగ లేని స
న్న్యాసుల, మిట్టి నీమగతనమ్మునకుం దగు వీరగౌరవో

ల్లాసము నెట్లు సల్పగ గలారము, మాటలు లేని మాదు వి
శ్వాసమె పచ్చకప్రపు నివాళిగ గైకొను మప్పరాణ్మణీ!

వల్లె చెప్పిన వేదపన్నాలు వర్జించి
బాణదేశికు డైన ద్రోణుశక్తి,
మంత్రోదకముల నిర్మల మైన చేదోయి
రక్తాంజ లిడిన భార్గవుని దీక్ష,
అమృత తేజోభూత మయిన గంటము వీడి
కత్తి దాలిచిన తిక్కన యశస్సు,
గోచీ వదల్చి కంగుల వీరకాసె గ
ట్టిన 'అనపోత' ధీరుని తపస్సు,
బ్రాహ్మణుడ వయి ధనువు చేపట్టి నట్టి
నీ భుజాయుగళీపీఠి నిలుచు గాత!
ఆంధ్రలోక ద్రోణాచార్యు డనెడి కీర్తి
మోయుదువు గాత శ్రీ అప్పరాయ ధన్వి!

## ౪

## సాధుశోధన

### మహాత్మ

అడవి స్మృతి తప్పి పడిపోయి నట్టి బుద్ధ
దేవునకు పాలు వోసె నే దివ్యమాత,
ఆ సుజాత నీ గొంతులో అమృతరసము
పోయ దేల నేడు నదృష్టముగ మహాత్మ!

రెండువే లేండ్ల కవల నీ ఋషులభూమి
నెత్తినా వహింసాధ్వజ మెత్తుగాను
చావ నున్న హింసాపిశాచమున కింత
దేహమును కోసి బలి యిచ్చితివె మహాత్మ!

పృథువు పిండిన జీవనౌషధులు దాల్చి
అలరు ఈ పుణ్యలోకవాతావరణము
భవదమల కాయసిద్ధికి వచ్చు గాక
వలసినట్టు లహర్నిశమ్ములు మహాత్మ!

లక్ష్మి కై దండ యిచ్చి లాలన మొనర్చు
ఏనుగును పీన్గు చేసి హసించు సింహ
ములను జూలుతో లాగితి పొదుగులోని
కవుర! పాల్ద్రావి వర్ధిల్లు మని మహాత్మ!

పగలచే తెగటారవు పగ లటంచు
పుత్రభేదకర్మల మైన భూమిమీద,
వంచినాడవు శిరసు ప్రపంచ మదర
కంటక కిరీటమునకు వేడ్క_ను మహాత్మ!

కాళ్లు చేతులు నెత్తురు కాఱ శిలువ
మీద 'అపరాధిజనుల క్షమింపు' మనుచు
ఈశ్వరుని వేడికొన్న ఆ యేసు క్రీస్తు
కీర్తి తనవారి కింత దక్కె_నె మహాత్మ!

గురులవేదిక కవల, భూవరుల సింహ
పీఠముల కెత్తుగా నిలిపితివి ధర్మ
మకుటమును, ప్రేమదీపము మండుచుండ;
అహహ భారత భాగ్యమే మన మహాత్మ!

మాతృగర్భ వ్రణంబును మాన్ప శస్త్ర
మంది తీవు, నీ తను వంటెనా విసంబు?
ఊర్ధ్వ నక్షత్రలోకమం దున్న సిద్ధ
పురుషు లద్దాని నేల మాన్పరు మహాత్మ?

సత్య మెడల నసత్యకోశంబు నుండి,
జ్యోతి ప్రజ్వరిల్లగ తమస్సును పెకల్చి
మృత్యుకరమున అమృత పాత్రికను కొంటి;
కర్మయోగ సూత్రములు తెగవా మహాత్మ!

*

# ప్రతిబింబము

ఎందు కింత క్రూరంబుగా నెడల పెడల
చీల్చి చిందరవందర చేసివైతు
వ్రేలబడిన యీ కుటిల తమాల శిఖల
నిలువుటద్దాన కెదురుగా నిలిచి నెలత ?

జొంపములు గొన్న యెలదోట శోకపెట్టి
చిక్కుడల్చు ఘాతుకులు నా స్మృతికి వత్తు
రబల ! పరిమళపిచ్ఛిల మయిన నీదు
నీలసూత్ర కులాయ దుష్పాలనమున.

మృదుల రుచి రుచిరము లయి కదలికల నొ
య్యారముల్ గురియగ మనోహరము లైన
ఈ సుబద్ధ పుష్పంధయన్యాస మేడ ?
వెలది, నీచేతి ధవళ లవిత్ర మేడ ?

ముసురు మో మని కినిసితో, కొసలు సాగి
వెను దగులు నంచు గోపింతో వెలది ! యేల
అణచి స్నేహము లేక యీ యంజనాద్రి
కాటుకపులుంగు మెఱుగు రెక్కలను ముడుతు ?

సందెగాలికి చెదరు నాషాఢమేఘ
పింఛములవలె నటు నిటు విరిసి కలియు
నట్టి యీయతసీకుసు మార్ద్రశయ్య
నగునె, వెల్ల ఱంపముమీద నాఱవేయ ?

# బుద్ధభిక్ష

ధర్మ ధేనువు చేపగా దాయగట్టి
జగతి బిదికె నెవం డహింసాపయస్సు,
నా తపస్వినరేణ్యు నాపు[illegible]మృతంబు
వీథివీథుల బడి పంచిపెట్టుకొనుచు-

కాళ్ళు కందగా కట్టిన గడప లెల్ల
నెక్కి దిగితిని పగ లెల్ల నీ పురాన,
పిలిచి నో రార చేయార భిక్ష పెట్టు
గ్రామవాసి యొకండును కానరాడు.

పుత్రవధ కీర్తనము చేయు వేదవాణి
నధ్యయన మొనరించు బ్రాహ్మణజనంబు;
సృష్టిచేతన మెల్ల నార్ద్రీకరించు
మహాదహింస కే పగిది బ్రహ్మణ్య మిచ్చు!

చంప చే యెత్తు కటికికసాయి యసికి
నవ్వుచు శిరస్సు వంచిన పువ్వు బెడద
జన మనోనుజీవిత పయః పూరమైన
మందు హింస నేటికి పరిహార్య లేదో!

ఊరి నలుప్రక్క లందును నుదయవేళ
కదలి, చీమలపుట్టల వెదకి వెదకి,

మంచి బియ్యము చల్లు సంసారు లకట,
మారినారు మతద్వేష మలిన మంటి!

వేసవి దినాల పక్షి దప్పికలు దీర్ప
ప్రమిదలను మంచి నీ ర్వోసి బయటి గోడ
మదురులందున బెట్టు బ్రాహ్మణ పురంధ్రు
లకట, యిపు డేల యిటు లదయాత్మ లైరి?

లేళ్ళ మేతకు పచ్చికబల్లు పెంచి
విడిచిపెట్టు కర్షకులు లోభింత్రు నేడు
కరుణమాలి తోటల కెల్ల కంచె వేసి;
మారెనె అశోక ధర్మ చక్రారపంక్తి?

తొట్టిలో పసిపాపను, దొడ్డిలోని
బాలవత్సమున్, తోటలో పచ్చి మొక్క
నేక వత్సలదృష్టితో సాకినట్టి
ప్రియకుటుంబిను లెల్ల రే మయిరో నేడు!

తీయ నీయ లేదు తేనె తెట్టెలనుండి,
త్రుంప నీయ లేదు తోడిమె ననలు,
కోయ నీయ లేదు కొమ్మలన్ ఫలములు,
ఎటుల మాఱెనో యహింస నేడు!

కావి గొన్న పరివ్రాజికా కులంబు
సుఖముగా చైత్యములయందు సుప్తి నొందు;

రాళ్ళ నిలువున ప్రియదర్శి వ్రాసినట్టి
ధర్మ పంక్తులు ధూళిలో దాగె నేడు.

కొఱికివేయుచున్నది చలి నరము లెల్ల
ప్రాయమున నున్న నన్నె సర్వాంగకముల;
కాన్పు లుడిగిన యీ గోవు కదల లేక
వణకు చున్నది నా వచఃశ్రేణి పగిది.

డొక్క లంటుకు పోయె, కండ్లు ముసుగు వడు
నీ పయస్విని నక్కటా యెట్లు చూతు!
చలికి కప్పుద మన్న వస్త్రంబు లేదు
ఒక్క కావికౌపీనము దక్క నాకు.

అనుచు విలపించుచుండె సన్న్యాసి యొకడు
లేవ లేని ఒక్క ముసలిగోవు పొంత,
ఆంధ్ర రాజేశ్వరీ కంఠహార మయిన
ధాన్యకటకమునం దొక శూన్యవీధి.

మేత తేలేడు, వృద్ధ గోమాత బాధ
చూడలేడు ప్రాణములు కొట్లాడుచుండ;
ఏమి తోచక చేదోయి నెత్తి గోమ
తల్లిని కవుంగలించె వత్సము విధాన.

బుంగతో నీళ్లు మోసుక పోవుచున్న
పేదరా లొర్తు చూచె హృద్భేదక మగు

నా మహార్తిసంక్రాంతి నిం కేమి చెప్ప
కలదొ యేమొ సూత్రాత్మ జగత్తునకును !

ముందు వెనకల నచ్చుచున్ పోవుచున్న
పౌరులను జూడలే దామె, వారిమీద
చినిగిపోయిన తనమేనిచీర విప్పి
బుద్ధభగవాను పేరు చెప్పుచును కప్పె.

*

## ఉత్తరాశ్వాసము

పసరుంబచ్చిక లిచ్చమై తిని, సరఃస్వాదూదక మ్మాని, ర
మ్య సరిత్కూలములందు పండుకొని రోమంథమ్ములన్ సల్పు మీ
పసులన్ బట్టిరి శత్రు; లాప్రల మరల్పన్ లేక వెన్కాడి, యె
ట్లు సమర్థింతువు నీదు చర్య? నగుబాటుల్ మ్రింగదే రచ్చలోన్?

ఆలున్ పాలును లేక గోష్ఠములలో నత్యాకటన్ వత్సముల్
పోలున్, చూడగ లేక గోపకులునున్ క్షోభింతు రీపాటి; కీ
యాలమ్ముం దరులన్ నధింపక భయ వ్యత్యస్త చిత్తుండవై
కాలుం గేలు గదల్ప, ఏ పిఱికిర క్తం బేడ రాబిడ్డకున్?

ఆశల్ మీఱగ నిన్ను బంపి రరికూటాటోపమున్ మీటి గో
రాశిన్ వీటికి గ్రమ్మరింతు వని; శస్త్రమ్మంది చక్కాడుము; లే
దా శంకింపక తేరినున్నెగలమీదన్ రమ్ము; నారీజనుల్
కాశల్ గట్టి తెగింపరే నరులు బిక్కంబోవు దుస్సంధులన్!

నరసాంతఃపుర శిష్టకన్యలకు లాస్యక్రీడలన్ నేర్పు కా
పురుషుం డేడ? భయద్రణోచిత భుజాపుంభావ సాధ్యాశుగా
చరణం బేడని సందియంపడకు; మస్మద్బాణసంజాల మీ
కురుసేనాహరిణాంకమండలము మ్రింగున్ చూడు రాహు క్రియన్.

మగవా డాడుది గాక పౌత్రజనసామాన్యాభిమానమ్ములన్
తగులం బెట్టితి దేశకాల పరచింతన్, సాహసోత్సాహముల్

తెగ తుత్తున్కలు గాగ, భారతకథాదీపంబె చల్లాఱిపో
వు గతుల్ పట్టెన ఏటికో పిదప నీవున్ నేను పాడుర్విపై ?

పన్నెండేండ్లు కటుప్రవాసగహనావాసార్తి నల్లాడి, ఈ
సన్నన్ చచ్చియు చాని చందమున అజ్ఞాతమ్ము పోద్రోసి, ర
క్తాన్నమ్ముల్ బలిగోరుచున్నవి మదీయక్రూరశస్త్రాస్త్రముల్
ఖిన్నుల్ దన్నుశమీమహీరుహముపై మేల్కొల్పుమో ఉత్తరా!

చావన్నన్ భయ మేల క్షత్రియుల? కస్వాధీనవృత్తమ్ములే
చావుల్, చావులకన్న కష్టములు; అస్మత్పౌరుష ప్రౌఢ ల
క్ష్మీ వైధవ్యము నేన చూచెదనె? ఇస్సీ క్లీబమీమాంస చే
తో విద్యుత్కళలన్ గ్రసించెదు నిరర్థుం డేగు లోకం బెదో !

అతిఘోర మ్మగు దుస్తపస్సునన దివ్యాస్త్రమ్ము లబ్బెన్, బహూ
కృతిగా నిచ్చిరి మెచ్చులాడి ధవళశ్రీవాభిరామాశ్వశో
భితమా స్యందనమున్; కటా! కడకు నిర్వేదవ్యథా ధూమధూ
పితమై మాయునె పాండుమధ్యమ భుజాభీలప్రభావద్యుతుల్?

*

# ౫

# గేయ గుచ్ఛము

## ౧

## వసంతము

(రవీంద్ర గీతి కనువాదము)

నేను వచ్చా నమ్మ నేను వచ్చానె
ఆలసింపక రారె యాడు కొందాము.

ఏడాది తొలికాగి ఎచట దాచారె?
నా పూలపల్లకీ నే పొంత నిడిరె?
తేనె వసంతాల తీర్థమ్ము లాడి
పసుపు కోకలు పిరుం దసియాడ దాల్చి;
నేను వచ్చా నమ్మ నేను వచ్చానె:
ఆలసింపక రారె యాడు కొందాము.

వేకువే వికసించు వేసాల మొల్ల!
ప్రొద్దు ప్రొద్దున పూయు ముద్దైన రోజా!
మవ్వముల్ రువ్వేటి మధ్యాహ్న మల్లె!
అందాలు పిదికేటి సందె సంపంగి!

పరిమళం బెగబోయు పచ్చగోరంట !
పైరగాలికి నవ్వు పడుచు గేదంగి !
    నేను వచ్చా నమ్మ నేను వచ్చానె:
    ఆలసింపక రావె ఆడు కొందాము.

చూచినా మోయి కుచ్చుల పూలరంగ !
నీ ముద్దురూపు వన్నెల కోడెకాడ !
చిగురు పాగాచెంగు లెగిరి జీరాడ
పడుచు ప్రాయము తీవి పగిలి పోనంగ
తోపుచీరెల మావి దాపలి దిశల
విరజాజి పందిళ్ళ వెలపలి పొదల
    నిన్ను జూచా మోయి నెఱజాణ తునక !
    నీకు చిక్కామోయి పోకిళ్ళ పుట్ట !

* *

ఎవ్వారే నను బల్కరించేరు ఇచట
మురళి వాయిస్తు నే పోవుచుండగను ?

    మావికొమ్మను నేను మన్మథాకార !
    నిలుపజాలని రక్తి నిన్ను పిల్చేను.
    నిన్ను జూడక మున్నె నీ దివ్యమూర్తి
    నా చిత్తబల మెల్ల దోచెం గదోయి !

    నీ పూత వాసనల్ రాపాడి నన్ను
    నాగర్వ రాగంబు లాగెం గదోయి !

ని న్నెఱుంగక ముందె నిన్ను భావించి
ప్రేమించినా నోయి చేలనై స్వామి!
మావికొమ్మను నేను మన్మథాకార!
నిలుపజాలని రక్తి నిన్ను పిల్చేను.

*　　　　*

తొలిజాము చల్లగా తొలగిన పిదప
ఆటపాటల రక్తి యలసిన వెనుక
వీథిలోపల ధూళి వేడి యెత్తంగ,
కడవల నీరాన కాకు లేగంగ,
వేసవి తలసూప నే సొక్కి సోలి
నిష్క్రమించేవేళ నిలుతురే మీరు?
ఎవ్వరే నను బల్కరించేరు ఇచట
మురళి వాయిస్తు నే పోవుచుండగను?
నేను వస్తా నోయి నేను వస్తాను,
మొగ్గమల్లెను నేను మురిపాల మొలక!

నీ యుత్తరీయంపు నీడ వెంబడిని
నీ కప్పురపు తమ్మనిగ్గు నందికొని
నీ నిల్వు తిలకమ్ములోన చెమ్మగిలి
నీ రాగమాలలో దారమై పెనగి
వలపుతో కడదాక నిలిచి యుంటాను
ఆసతో నందాక అంటి యుంటాను.

*　　　　*

సన్నజాజిని నేను సరసాలచైత్ర!
తేనెచిన్కను నేను తియ్యాలతునక!
నీ సిగపూలలో వాసనై యణగి,
నీ కంఠమాలలో రేకునై కలసి,
పూలు రేకులు కూడి పొలుపారుదాక,
తమ్మి తూడును కూడి తనివొందుదాక,
నీ వాక్కు కర్థమై నే వెల్గుతాను,
నీ చూపుపాపనై నే నటిస్తాను.

ఎడబాట్లు కలిగేటి యెండకాలమున
నను వీడక కృశించు ననరాణి యెవతె?
నా వేణువును కరుణమ్ముగా నూది
అప్పగింతలు పాడు నార్ద్రకాలమున
ఎల్లెడ కారాకు లల్లాడువేళ
అంటియుంటా రెవ్వ రపుడు నా దండ?

*　　　*

గన్నేరు మొగ్గనే గరువాలగడ్డ!
నిన్ను మోహించాను నిండారు కూర్మి.
నీదు కౌగిట నన్ను నిలువని మ్మోయి,
నీ శయ్య నన్ను రాణింప నిమ్మోయి,
నీ నవ్వు చల్వలో నానని మ్మోయి,
నీ లాలనసుఖాన సోలని మ్మోయి!

నేను వస్తా నోయి నేను వస్తాను:
వచ్చి నీ వెనువెంట వలచి యుంటాను.
మందారమును నేను మాధ్వీపిపాసి!
నీదు పచ్చనిరూపు నే కోరినాను.
ఏ కిన్నెర స్వరాన నెలు గెత్తి మమ్ము
పిలిచితో ఆ ముద్దు పిలుపు లోపలనె
కలదు నీదు వియోగ గద్గదస్వరము.
నే నెఱుంగుదు నోయి నే నెఱుంగుదును;
నేను పోల్చితి నోయి నేను పోల్చితిని.

ఎందుకో ఆలస్య, మెందుకో అలత,
ఎందుకో సందేహ, మెందుకో కలత;
అందుకో వోయి మోహన సూత్రధారి!
నా ప్రేమపూజ లందవు దండ గట్టి.

*

౨

## సంక్రాంతి

వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి,
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి,
తేనెవాకలు పాలు తెనుగు వాడలకు
అందాలు పొంగేటి ఆంధ్ర భూములకు.

వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి,
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి,
పంట రాసులపైన నవళించి లేచి
తేటతటాకాల తీర్థమ్ము లాడి.

వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి,
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి,
వన్నె ముగ్గులు పెట్టి వాకిళ్ళ ముందు
పూదేనెతో వారు పోతాము రావె;
వెల్లజాదుల మీాలు వీధి వేదికల
గంపలతో పండ్లు నింపుదము రావె.

వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి,
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి,

అరటి స్తంభాలతో అందగింతాము
బంతి పూదండలన్ భాగించుదాము
తామ రాకులతోడ దళ్ళల్లుదాము
కలవ కాడలతోడ మెలికె లేతాము.

వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి,
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి,
చందనం బసరంజి బిందెలన్ నింపి
పసుపు కుంకుమ లాకుపళ్లాల బోసి
పౌన్నాకు విస్తళ్ళ భోగంబు పెట్టి
ఆరగింపు మ టంచు ఆమతింతాము.

వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి,
వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి,
కళ్యాణకంఠి ఈ కన్నె సంక్రాంతి
భోగాలబాల ఈ భోగి సంక్రాంతి
వేడుకల్ విప్పార తోడి తెత్తాము
ప్రియ మైన పాటలన్ పిలిచి వత్తాము.

రా వేమె రా వేమె రాగాల కొమ్మ!
రా వేమె రా వేమె రతనాల బొమ్మ!

*

3

ఆ నీలనగరిలో అందాలవాడ
అందాల వాడలో అది తెల్ల మేడ
ఆ మేడదాపునా అమృతంపు కొలను
కొలనిలో చక్కగా కులికేటి పూలు
పూలలో పొంగేటి పాలధారలను
నీ వెండిగిన్నెలో నింపి నెమ్మదిగా
మా చిన్నిపాపకు మాపు రేపుల్లు
చల్లగా తెచ్చియ్యి చందమామయ్య !

✱

౮

తెల్లకుచ్చుల పాగ అల్లల్ల నసియాడ
చిన్ని గొఱ్ఱెల మేపు చిన్నారిగొల్లాడ !
పరుగెత్తి పొయ్యేవు పడిపోయిన ట్లేమొ
పెరుగమ్మ బోయె నీ పెండ్లాము, లే దింట;
నీ జున్నుపా లెల్ల త్రావేమొ యింతలో ?
నిలుచుండు కాసంత పలు కున్న దో మామ !
మునిగిపో లేదు నీ ముత్యాల భవనంబు,
పాఱిపో లేదు నీ పాడిగొఱ్ఱెల మంద.

నిదురపో మాతండ్రి నిదురబో వోయి !
నిదుర బోయె జగంబు నిఖిలప్రాణులతో !
సిరిసిరి జాబిల్లి చెఱిపేటి మోము
పాసిన పుష్పమై మాసెరా తండ్రి !
మల్లె గుత్తులు పాఱజల్లు చెక్కిళ్లు
పిల్లరావి చిగుళ్ళ మళ్లాయె తండ్రి !
పాలు పొంగేటి నీ బంగారు కండ్లు
వాలారు నీలాలు రాలెరా తండ్రి !

*

౫

## ప్రభాతము

వెండిగొలుసులు లంకె లేసి ప్ర
  చండ మగు నీ నీలి తెరలను
తూర్పువాకిలి తలుపు రెక్కల
  తొలగ లాగెద రెవ్వరో?

నిదుర విడి ఆశా నితంబిని
  నీలవేణి విదల్ప రాలెడి
మల్లెపూవుల పగిది జాఱెను
  అల్లనల్లన తారకల్.

పండు కుంకుమ కలిపి తీర్చిన
  పచ్చి ముగ్గుల అల్లికలవలె,
ఉపరిగత వాతాయనమ్ముల
  నుండి అరుణిమ లగపడెన్.

ప్రథమపుత్రోదయము వేళను
  భాసిలెడి సంపన్నగృహ మటు
లతివికాస సుఖాభిముఖ మయి
  అలరె బో జగ మంతయున్.

దూరమందు నిలిచి సూటిగ
తోరమగు బంగారు వలలను
తమ్మికొలకుల విసరి వేయుచు
తారసించెద రెవ్వరో ?

కాల నాటకమందు ప్రథమాం
కమున సుకవి ఉషః ప్రవేశము
అనుఘటించిన శుభముహూర్తం
బగు నొకో ఈ సందెయున్ !

ఈ మహోత్సవ మధుమదవ దభి
రామ సూక్తము సంత జెప్పగ,
ఇగురు మ్రింగి నిరుక్తి నెఱిగిన
పొగరు ద్విజకులమే తగున్.

శీతపీడకు నునుపు మాయగ
సిగ్గు చితికిన కొమ్మ లెల్లను
పల్లవించెను నవ్యరంజన,
నడుము వంకర తీర్చునో !

కొమ్మలకు పగడాల సర మయి
కోయిలకు రక్తామిషం బయి
ఆశలకు ఉద్దీపనా లయి
అలరు అల రీ పొద్దులన్.

అబల అధరము నంటి యంటక
　　ఆటిపోయెడి ముద్దు లట్టుల
తాకి తాకక ఒడలు పులకల
　　తడియ నోలయు సమీారముల్.

*

౬

# యాత్ర

కావికొంగులు లాగికొని తన
కనక భాండముతోడ బిరబిర
సాగిపోయెడు సందె చిన్నది,
సందడింపుదు త్రోవరుల్ !

మూసికొనె ఆశా కవాటము,
మునుగుబడె ఆకాశ దీపము,
ఆలసించిన కల దపాయము
అంధకారము పైకొనున్.

బుసలు కొట్టుచు ఈ ప్రవాహము
కసరి రేగెడు నల్లత్రాచటు;
దాట దలచిన తొందరింపుడు
బాటసారులు తెలివితోన్.

పల్లెవాఁడో క్రొత్త, నదియును
అల్ల కల్లోలముగ పొంగెడు;
ఒడలు తెలియక మిడిసి పడియెడు
గడుసు తరగలు కైపునన్.

గర్భఘాత సహింప జాలక,
దుర్భరంబుగ దుఃఖపడు నీ
పుడమితల్లి కఠోర కంఠము
భోరుభో రని వినబడున్.

కాళవక్త్రము తెఱచి చీకటి
కవియుచున్నది మ్రింగు మాదిరి;
వేగిరింపుడు ఏటియావలి
కేగ దలచిన యాత్రికుల్.

కన్ను లుండియు కానరా, విక
తెన్ను దిక్కును తోప దాపయి,
తోడునీడలు లేని వాడలు
కూడ దందురు పెద్దలున్.

పొంగి పొరలు నదిం గనుంగొని
క్రుంగిపోవగ నేటికో యిటు
నావపయి చుక్కాని త్రిప్పగ
నావికుడు నిలుచుండగన్ ?

ఏటి సందిట ఆడుచున్నది
ఆటబొమ్మ విధాన నావయు;
కేకిసలు గొట్టుచు సుడిం బడు
కెరటములు పయి కెగిరెడిన్.

ఈ మహోత్సవ మధురసంధ్యల
 ఏటి కోపము ఏటితల్లికి ?
దాటిపోదము రండు పథికులు
 తల్లి చేతుల మీదుగా.

నమ్మనందుకు ఏమి హేతువు
 నావికుని ప్రియమైన పిలుపును-
నమ్మి చెడిరే యాత్రికులు మును
 ఇమ్మహీ వలయమ్మునన్ ?

*

౭

## పాలబాన

అత్యంత సుకుమారి వైనట్లు కనుపింతు
వేలాగు నడిచితో ఈ దూరపథ మెల్ల ?
ఏ లీల గడచితో ఈ ముండ్ల పొద లెల్ల ?

ఆకు పచ్చని నిగ్గు లసియాడు నీ మేన
ఏ భంగి మోసితో ఈ పాల భాండంబు ?
ఏచాయ మూసితో ఈ బాలభాగ్యంబు ?

కూర్చుండు మొక్కింత చేర్చుక్క చెమ టాఱ
సోలేవు లేకున్న సురపొన్న సుమమట్లు,
వ్రాలేవు లేకున్న పసి తమలపా కట్లు.

గులక ఊ బాటలన్ మొలక పూదోటలా
గే చాయ మార్చితో ఈ మెత్తని పదాల ?
ఏ తల్లి నేర్పెనో ఈ యింద్రజాలమ్ము?

ఎవరి యింటివి ఆలు ? ఎవరు పిండిరి పాలు?
చిన్నారి లేగలన్ కన్నె తీగల గట్టి
కన్నారి కడ కిట్లు మున్నె వచ్చితి వెట్లు ?

పా లూఱు నీ పల్కు బాలెంత పసి చిల్కు
పా లీయ వచ్చితీ పడరాని పాట్లోర్చి
పా లమ్ము వ్రత మంత పరమ భగవద్వ్రితమె!

౮

## చి ల్క

పుట్టింది ఒక చిల్క
పొలము పచ్చల బైట—
పొరలు వాకల నాట—
అల్లారు ముద్దుగా – అందాలహద్దుగా
...పుట్టింది ఒక చిల్క

పెరిగింది ఆ చిల్క
పిండివెన్నెల సీమ—
పిల్లతెమ్మెర లోమ—
పూ బొత్తికలలోన – పోకిళ్లు కల లీన
...పెరిగింది ఆ చిల్క

త్రావింది ఆ చిల్క
తళుకుతీవెల రాలు—
తరిపి రంగులపాలు—
పతెూలు పచ్చగా – పలువన్నె లెచ్చగా
...త్రావింది ఆ చిల్క

చవి జూచె నా చిల్క
చల్ల వెన్నెల రేల —

చందమామల మ్రోల—
పండుటాకుల జున్ను - వెండిగిన్నెల వెన్న
...చవి చూచె నా చిల్క—

ఆడింది ఆ చిల్క—
అలరు మావుల నీడ—
ఆడు బిడ్డలతోడ—
ఆబాల గోపాల - మానందమున సోల
...ఆడింది ఆ చిల్క—

పలికింది ఆ చిల్క—
తెలుగు మాటె మరంద
మలుగువాలు- సమంద
సౌందర్య మూరగా - సారస్య ధారగా
...పలికింది ఆ చిల్క—

నేర్చింది ఆ చిల్క—
నిండు కమ్మదనాలు—
పండ్ల పక్వరసాలు—
పొంగారు పదములన్ - బంగారు ఫణుతులన్
...నేర్చింది ఆ చిల్క—

వినిపించె నా చిల్క—
తెనుగు వాకిండ్లలో—

పెనుగు పూ చెండ్లలో—
మిసలాడు మవ్వాల - అసియాడు అందాల
...వినిపించె నా చిల్క

పాడితే ఆ చిల్క
పారవశ్యము పొంగు—
భావదాస్యము క్రుంగు—
తెగిపోవు వీణియల్ - దిగివచ్చు వాణియున్
...పాడితే ఆ చిల్క.

ఆ చిల్క నుతి కోఱకు
ఆరాటపడె గీత—
కారాడె నునుకైత—
రాగాల ముద్దుకో - రసపాక సిద్ధికో!
...ఆ చిల్క నుతి కోఱకు.

విన్నారు జను లెల్ల,
విన్నారు పండితుల్—
విన్నారు పాఠకుల్—
భూచక్ర ముల్కగా - ఆ చిల్క పల్కగా
...విన్నారు జను లెల్ల.

బ్రహ్మాండ మయినట్టి
భాష్యాలు తుది ముట్ట—
పఠియించె నొక భట్టు—
పాండిత్యమున వచో - భాండంబు బరు వెక్క.

ఆ చిల్క నుడికార
మావేశ మెగబోయ—
ఆలించి వల వేయ—
పరవశంబున జిక్కె - పరతంత్రతనె మెక్కె.

తెలుపారె తూర్పెల్ల
తెనుగు కుంకుమ తీగ—
లనుగు కొమ్మలు సాగ—
ఎలు గెత్తె నా చిల్క - అలవాటు మెయి కుల్క

వినువారు లే రైరి
చనువారలు హాలంత
గణపాఠము - లజంత
భేదాప వాదాలె - చాదేరు మువ్వేళ.

తన ముద్దు గీతాల
కను వైన లయ లేదు—
చను వైన శ్రుతి రాదు—
పరిశోధనమె, సంధి - సదమదమ్ములె యెందు.

తన టెక్కలను నిత్య
తరుణిమల్ పెన వోవు—
తళతళల్ కనరావు—
ఆ ధాతు దుర్గాల - నా దేశ మార్గాల.

పొదకట్ల వేతట్లు—
పొదుచు పూవులమళ్లు—
పదుచు మావికుదుళ్లు—
మారేడుతరు లెల్ల – మహనీయకుశ లెల్ల.

ఆ యగ్ని వేదికన్
ఆ శబ్ద ఘోషలో—
ఆశిష్ట భాషలో—
ఉడికింది ఆచిల్క – మిడికింది కడు నల్క.

మ్రాగన్ను పెట్టింది
మధురకంఠము మూసి—
మనసు ముచ్చట రోసి—
గాసిల్లి గాసిల్లి – ఆసించె తొలి యిల్లె.

భారతారణ్యాన
పడిపోయె నా భట్టు—
విడిపోయె వాకట్టు—
ఇదె సం దనుచు చిల్క – యెగిరిపోయింది.

దానిమ్మ పండ్లలో
తరుణ మాణిక్యాల—
నరుణ రేఖలు తేల—
తీసింది ఆ చిల్క – తేటనెత్తురు తేర.

తినబోయి తినలేక
తననోట బిగియించి—
కనుసూటిగ లగించి—
వ్రాలింది పెన్నా స్ర - వంతియొడ్డున సందె.
పచ్చి కెంపుల బువ్వ
భక్షింపగా నుండె—
వీక్షింప కేదండ—
ఒడిసి గైకొనె నింత - లో. నెక్క తిక్కన్న.

*

# సత్మాక జయంతి

ఓ సుస్వతంత్రమా! ఓ మోహమంత్రమా!
– నీ రూపు కనబడేనా – ఎందైన – ఎపుడైన
నీ రేక తేటబడునా – ఓ సుస్వతంత్రమా...

నీ నామ జపమాల నిష్ఠతో త్రిప్పితిమి
– కంటక పథాలలో కటికిచీకట్లలో –
కక్కసల చెఱలలో – ఓ సుస్వతంత్రమా...

నీ మోము భయభూత ధూమాగ్నివలయమో
– కళ్యాణ పాత్రమో – కనక శతపత్రమో –
కనుపించునా మాకు – ఓ సుస్వతంత్రమా...

నిండి తొణికిసలాడు నీ భుజా భాండంబు
– మము బలిమి లాగేను – మధురరస మున్నదో –
మరులవిష మున్నదో – ఓ సుస్వతంత్రమా...

నీ కుశలఖేలనము నిఖిల సుఖరూపకమొ
– జగడాల జూదమో – జాతర్లు సలిపేరు
జాతులును రాజ్యాలు – ఓ సుస్వతంత్రమా...

నరుని స్వాతంత్ర్యమై నారీ స్వతంత్రమై
– అర్థ స్వతంత్రమై – వ్యక్తి స్వతంత్రమై
తెగునె నీ సూత్రంబు – ఓ సుస్వతంత్రమా...

జన్మహక్కుల చిక్కి - స్వార్జితంబుల చీలి
రాజ్యసీమల నిరికి - పూజ్య మగు నీ పొలము
పండునో ఎండునో - ఓ సుస్వతంత్రమా...

స్వకుటుంబ కలహాలు - జాతి మత భేదాలు
- నీ తలకు చుట్టేరు నీతివేత్తలు నేడు
నిజమో అబద్ధమో ఓహో స్వతంత్రమా...

పంచభూతంబులును భాగాలు పంచుకొని
- తెగి స్వతంత్రించితే - దిక్కేది ఈ లోక
తీర్థయాత్రకు రేపు - ఓహో స్వతంత్రమా...

స్మారక దివసము
30.1.1951

సమాప్తము

ტ. 2